ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## తెలుగు అద్భుతమైన భాష

మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ

2లో..

సంపుటి: 2 | సంచిక: 137 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 26 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## మహిళలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపం

### దోషులను విడిచిపెట్టకూడదు : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): మహిళలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపమని, దోషులను విడిచిపెట్టకూడదని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల గౌరవాన్ని కాపాడడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. మహారాష్ట్రలో లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, దేశంలో నారీమణులపై పెరుగుతున్న ఆకృత్యాలపై అసహనం వ్యక్తం చేశారు. దేశంలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపమని, దోషులను విడిచిపెట్టకూడదని తెలిపారు. మహిళల భద్రతకు దేశం ప్రాధాన్యం ఇవ్వాలని వ్యాఖ్యానించారు. ఉత్తర మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగిన లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**మహిళలకు గత ప్రభుత్వాల కంటే చాలా ఎక్కువ చేశాం**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మహిళలకు గత ప్రభుత్వాలు చేసిన దానికంటే, ..మిగతా 2లో

## యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్: ఖర్గే



న్యూఢిల్లీ, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్‌లని ఖర్గే అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మోదీ సర్కార్ తీసుకున్న పలు కీలక నిర్ణయాలను మళ్లీ వెనక్కితీసుకోవడం వెనుక విపక్షాల విమర్శల దాడి ఉందని పేర్కొన్నారు. జూన్ 4 తర్వాత ప్రజల శక్తి ప్రధాని అహంకారంపై విజయం సాధించిందని చెప్పారు. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్‌పై ..మిగతా 2లో

## చెరువులు చెర బట్టిన వారి...

# భరతం పడతాం

## సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): తమపై ఎంత ఒత్తిడి ఉన్నా వెనక్కి తగ్గకుండా అక్రమ నిర్మాణాలు కూలగొడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకృష్ణ భగవానుడి బోధన అనుసారం చెరువులను కాపాడుతున్నామని తెలిపారు. చెరువులను చెరబట్టిన వాళ్ల నుంచి వాటిని విముక్తి చేయాలనుకున్నామని వెల్లడించారు. శ్రీకృష్ణ భగవానుడి బోధన అనుసారం చెరువులను కాపాడేందుకు అక్రమ నిర్మాణాలు కూలగొడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తమపై ఎంత ఒత్తిడి ఉన్నా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగుతున్నామని చెప్పారు. హైదరాబాద్ మహానగరంలో చెరువులను చెరబట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని వెల్లడించారుయ కోకాపేట్ అక్షయ పాత్ర ఫౌండేషన్ సమీపంలో హరే కృష్ణ హెరిటేజ్ టవర్ ఆధ్వర్యంలో అనంత శేష స్థాపన ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

**అక్రమార్కుల నుంచి చెరువులను విముక్తి చేస్తాం**

చెరువులు మనవాళికి జీవనాధారమన్న రేవంత్ రెడ్డి, కొందరు శ్రీమంతులు వాటిలో ఫామ్‌హౌజ్‌లు నిర్మించారని అసహనం వ్యక్తం చేశారు. అక్రమార్కుల నుంచి చెరువులను విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు చేసిన వ్యక్తులు ప్రభుత్వాన్ని ప్రభావితం చేసిన స్థాయిలో ఉండొచ్చని అన్నారు. ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తే అది మనమీద కక్ష కడుతుందని పేర్కొన్నారు. విద్యా, వైద్యం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతనిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**తెలంగాణకు కోకాపేట ఆర్థికక్షేత్రం**

భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ధ్యాన కేంద్రాన్ని నిర్మిస్తున్నారని నిర్వాహకులను సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. స్థలదాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. సమాజంలో వ్యక్తులకు స్ఫూర్తినిచ్చేలా హెరిటేజ్ టవర్ నిర్మాణం జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హెరిటేజ్ టవర్ నిర్మాణం 36 నుంచి ..మిగతా 2లో



## ఘోర రోడ్డు ప్రమాదం

### 14 వాహనాలు ధ్వంసం, ఐదుగురు మృతి

హొసూరు, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లా హొసూరు సమీపంలోని పేరండ్లపల్లి వద్ద జాతీయ రహదారి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు హైవేపై నమ్మశక్యం కాని రీతిలో వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 8 కార్లు, రెండు బస్సులు, 4 లారీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. మరో 10 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హొసూరు, క్రిష్ణగిరి ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది. బెంగళూరు-క్రిష్ణగిరి మార్గంలోని హొసూరు సమీపంలోని పేరండ్లపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. బెంగళూరు-క్రిష్ణగిరి హైవే పై ఇరువైపులా కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయింది. గ్రానైట్‌తో వెళుతున్న లారీ బ్రేక్ ఫెయిల్ అయ్యి కారుని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ వెనకే వస్తున్న పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. మొత్తం 15 వాహనాలు ఢీకొనగా.. 14 వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## కూల్చివేతలపై హైడ్రా నివేదిక

లిస్టులో ప్రముఖులకు చెందిన నిర్మాణాలు



2

## ఎఫ్‌టిఎల్‌లో ఉన్న ప్రభుత్వ నిర్మాణాలను కూలుస్తారా?



బుద్వేల్, ఆగస్టు25(ప్రభాత ఉదయం) : హైడ్రాకు చట్టబద్ధత లేదని హైదరాబాద్ ఎంపీ , మజ్లీస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం శాస్త్రి పురం కాలనీలో గల తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొందరు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధాన మిచ్చారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎఫ్ టి ఎల్ లోనే ఉ ందని, తాను హైస్కూల్ చదువుకునే సమయంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కు వెళ్తున్న సందర్భంగా అక్కడ అన్ని నీళ్లు ఉండేవని అని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూలుస్తారా... అని ప్రశ్నించారు . నెక్లెస్ రోడ్ అంతా ఎఫ్ టీ ఎల్ లోనే ఉందని, హిమాయత్ సాగర్ లో గల సీసీఎంబీ కార్యాలయం ఎఫ్ టీ ఎల్ పరిధిలోనే ఉందని దాన్ని కూడా కూలుస్తారా అంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న నూతన వక్ఫ్ బోర్డు చట్టం అంతా లోప భుయిష్టంగా ఉందన్నారు.

## తెలంగాణలో టీడీపీ బలోపేతంపై

# చంద్రబాబు ఫోకస్



హైదరాబాద్, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): ప్రపంచంలో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలనే ఆలోచనతోనే నిరంతరం పనిచేస్తున్నానని ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పార్టీ శ్రేణులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతంపై ముఖ్యనేతలతో చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడి ఎంపికపైనా 33 సమావేశంలో చర్చించారు. 2047 వందేళ్ల స్వాతంత్ర్య వేడుకల్లో భారత్ అగ్రస్థానంలో ఉండాలని, అందులో తెలుగు రాష్ట్రాలు మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలి సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలంగాణాలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ క్రమంలో తెలంగాణాలో ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వం తీసుకొనే ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. 15 రోజులకు ఒకసారి రాష్ట్రానికి వచ్చేందుకు ప్రయత్నిస్తానని అందరినీ కలిసి అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు అన్నారు. తెలంగాణ తెలుగు దేశం పార్టీకి నూతన జవసత్వాలు అందించడానికి యువ రక్తాన్ని ప్రోత్సహించాలని చంద్రబాబు నిర్ణయించారు. పార్టీలో యువకులకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. “మీ అందరినీ కలవడానికి వచ్చాను. తెలుగు ప్రజలు 45 ఏళ్లగా నన్ను ఆశీర్వదిస్తూ వస్తున్నారు. టీడీపీని బలోపేతం చేశారు. అందుకు తగినట్లే పార్టీ నిరంతరం ప్రజలకు సేవ ..మిగతా 2లో

# తెలుగు అద్భుతమైన భాష

## మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): తెలుగు భాష ఒక అద్భుతమైన భాష అని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ నెల 29న తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచంలోని తెలుగు మాట్లాడే వారందరికీ తెలుగుభాష దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ భాగంలోని శివ-శక్తి పాయింట్ వద్ద విజయవంతంగా ల్యాండ్ అయింది. ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ నిలిచింది. రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువతను అనుసంధానం చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చిన పిలుపునకు విపరీతమైన స్పందన వచ్చింది. దీన్ని బట్టి మన యువత ఎంత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారో అర్థమవుతుంది. కుటుంబ ఆధారిత రాజకీయాలు కొత్త ప్రతిభను అణిచివేస్తాయి.ప్రతి ఇల్లు త్రివర్ణపతాకం, దేశం మొత్తం త్రివర్ణపతాకం అంటూ ఈసారి ప్రచారం ఉధృతంగా సాగింది. దేశంలోని నలుమూలల నుండి ఈ ప్రచారానికి సంబంధించిన అద్భుతమైన చిత్రాలు వచ్చాయి. ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించడం చూశాం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో త్రివర్ణ పతాకం కనిపించింది. ప్రజలు తమ దుకాణాలు, కార్యాలయాలలో త్రివర్ణ పతాకాన్ని ఉంచారు, ప్రజలు తమ డెస్క్‌టాప్‌లు, మొబైల్‌లు, వాహనాలపై కూడా త్రివర్ణ పతాకాన్ని ఉంచుకున్నారు. ఈ ప్రచారం యావత్ దేశాన్ని ఒకదానితో ఒకటి ముడిపెట్టింది. ఇది 'ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్'... అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పిల్లల పౌష్టికాహారమే దేశం ప్రాధాన్యత. మేము ఏడాది పొడవునా వారి పోషణపై శ్రద్ధ చూపుతున్నప్పటికీ, ఒక నెల పాటు దేశం దానిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. దీని కోసం, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 30 మధ్య పోషకాహార మాసాన్ని నిర్వహిస్తున్నాం. నేడు వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి మనం మరోసారి అదే స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయాల్సిన అవసరం ఉంది.... అని ప్రధాని మోదీ చెప్పారు.





## మహిళలపై నేరాలకు పాల్పడడం
# క్షమించరాని పాపం

మొదటి పేజీ తరువాయి...

గత పదేళ్లలో ఎన్‌డీఏ సర్కార్ నారీమణుల కోసం చాలా చేసిందన్నారు ప్రధాని మోదీ. 2014 వరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.25,000 కోట్లలోపే రుణాలు ఇచ్చారని, అయితే గత 10 ఏళ్లలో రూ.9 లక్షల కోట్ల సాయం అందించామని వెల్లడించారు. లఖ్‌పతీ దీదీ పథకం కేవలం మహిళల ఆదాయాన్ని పెంచడమే కాక, భవిష్యత్తు తరాలకు సాధికారత చేకూర్చేదని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో జల్గావ్‌లో లఖ్‌పతీ దీదీలతో సంభాషించారు ప్రధాని మోదీ. అలాగే 4.3 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 48 లక్షల మంది సభ్యులకు లబ్ధి చేకూర్చే రూ.2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. మహిళలు ఇల్లు, కుటుంబాన్ని ముందుండి నడిపిస్తారు. అయితే మహిళలకు సాయం చేయడానికి గత ప్రభుత్వాలేవీ ముందుకు రాలేదు. మహిళల పేరు మీద ఆస్తులు లేవని, బ్యాంకులో రుణం పొందలేకపోయేవారు. అందుకే నేను మీ కొడుకు, సోదరుడిగా మహిళా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటున్నాను. గత పదేళ్లలో కోటి మంది లఖ్‌పతీ దీదీలను తయారు చేశాం. మహారాష్ట్ర భవిష్యత్, శ్రేయస్సు కోసం బీజేపీ నేతృత్వంలోని మహాయుతి సర్కార్ రాష్ట్రంలో మరిన్ని ఏళ్లు పాలనలో ఉండాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి చెందిన భారత్‌లో మహారాష్ట్ర ఒక ప్రకాశించే నక్షత్రం. రాష్ట్ర ప్రజలంటే పోలండ్ దేశస్థులకు చాలా గౌరవం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పోలాండ్ శరణార్థులకు మరాఠీ ప్రజలు అండగా నిలిచారు. అందుకే పోలాండ్ దేశస్థులు ఇప్పటికీ మహారాష్ట్ర ప్రజలను గౌరవిస్తారు" అని ప్రధాని మోదీ తెలిపారు.

# యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్: ఖర్గే

మొదటి పేజీ తరువాయి...

వెనక్కితగ్గడం, వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపడం, బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు ముసాయిదా ఉపసంహరణ, అధికార యంత్రాంగంలో లేటరల్ ఎంట్రీ రద్దు వంటి ఎన్నో నిర్ణయాలను మోదీ ప్రభుత్వం ఇటీవల వెనక్కితీసుకుందని ఖర్గే గుర్తుచేశారు. ఈ నియంతృత్వ ప్రభుత్వం నుంచి తాము 140 కోట్ల మందిని కాపాడుతున్నామని, ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చామని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్‌కు భరోసా ఇచ్చే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్కు కేంద్ర క్యాబినెట్ శనివారం ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. యుపిఎస్‌ని ఎంచుకునే ఉద్యోగులు 25 సంవత్సరాల కనీస సర్వీసుతో సూపర్‌యాన్యు యేషన్‌కు ముందు గత 12 నెలల్లో డ్రా చేసిన సగటు ప్రాథమిక వేతనంలో 50 శాతం హామీ ఇవ్వబడిన పెన్షన్ పొందేందుకు అర్హులు.



# కూల్చివేతలపై హైడ్రా నివేదిక

## లిస్టులో ప్రముఖులకు చెందిన నిర్మాణాలు

హైదరాబాద్, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ మహానగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై ప్రభుత్వానికి హైడ్రా నివేదిక సమర్పించింది. ఇప్పటి వరకు 18 ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేసి 43 ఎకరాల 94 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా వెల్లడించింది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులకు చెందిన అక్రమ నిర్మాణాలతోపాటు సినీ, క్రీడా ప్రముఖులు చెందిన అనధికారిక నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా స్పష్టం చేసింది. రాష్ట్ర రాజధానిలో సంచలనంగా మారిన హైడ్రా, అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను కబ్జా చేసిన వారిపై కన్నెర్ర చేస్తూ అక్రమ నిర్మాణాలను నేలకూలుస్తోంది. ఈ క్రమంలో జూన్ 27 నంచి ఆగస్టు 24 వరకు కూల్చివేతలకు సంబంధించిన నివేదికను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి సమర్పించారు. ఇప్పటి వరకు 18 ప్రాంతాల్లో 166 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా వెల్లడించింది. రాజకీయ నేతల ఆక్రమణలు : తద్వారా కబ్జాదారుల నుంచి 43 ఎకరాల 94 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి వివరించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లతో పాటు పార్కు స్థలలాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిలో పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులున్నట్లు హైడ్రా ప్రభుత్వానికి నివేదించింది. చింతల్ చెరువులో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను కూల్చివేసి 3 ఎకరాల 5 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే నందగిరి హిల్స్‌కు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మద్దతుతో ఆక్రమించిన పార్క్ స్థలంలోని 18 గుంటల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. బహదూర్‌పురా ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబిన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మిరాజ్ రెహమత్ బేగ్ రాజేంద్రనగర్‌లోని బుమ్ రూఖ్‌దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన రెండు ఐదస్తుల భవనాలు, ఒకటి రెండస్తుల భవనంతోపాటు మరో భవనాన్ని కూల్చివేశామని హైడ్రా స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల నిర్మాణాలు : ఇక్కడ మొత్తం 45 అక్రమ నిర్మాణాలు కూల్చివేసి 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్లు హైడ్రా ప్రభుత్వానికి తెలిపింది. ఇక గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఖానాపూర్, చిలుకూరు వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జీవీ భాస్కర్ రావు, మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రోకబడ్డీ యజమాని అనుపమలు ఆక్రమంగా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహారీలను కూల్చివేసినట్లు హైడ్రా వివరించింది. ఖానాపూర్, చిలుకూరు వద్ద గండిపేట ఎఫ్‌టీఎల్‌లోని 14 ఎకరాల 80 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా పేర్కొంది. అలాగే మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువులో అక్రమంగా నిర్మించిన ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించిన 2 నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా తెలిపింది. ఇక్కడ 4 ఎకరాల 9 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా పేర్కొంది. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేసి 16 గుంటలు స్వాధీనం చేసుకున్నామని హైడ్రా తెలిపింది. అలాగే మన్సూరాబాద్‌లో 2 గుంటలు, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలా నగర్‌లో ఎకరా 4 గుంటలు, ఫిల్మ్‌నగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్‌ను కూల్చి వేసి 5 ఎకరాలు, గాజులరామారం మహాదేవపురం వద్ద ఒక గుంట స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా తెలిపింది. అలాగే గాజుల రామారాం భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్‌పేటలో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం ఒకటి, నాలుగు అంతస్తుల భవనం రెండింటిని కూల్చివేసి 16 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా తెలిపింది. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటలు స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదించారు.

# తప్పు చేస్తే క్షమించను..

## అధికారులకు మంత్రి పొంగులేటి వార్నింగ్



హైదరాబాద్, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. సబ్ రిజిస్ట్రార్లు, డీఐజీలు, జాయింట్ డీజీలు, ఐజీ, అదనపు ఐజీ స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా సమావేశంలో రెవెన్యూ శాఖ అధికారులపై మంత్రి కోపడ్డారు. పలువురి అధికారుల పనితీరు బాలేదని.. మార్చుకోకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంపుపై సమావేశంలో చర్చ జరిగింది. ఉద్యోగుల సమస్యలు, బకాయిలతోపాటు పలు అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పలు అంశాలపై అధ్యయనం కోసం అధికారులు ఇటీవలే వివిధ రాష్ట్రాల్లో పర్యటించారు. వారు తెచ్చిన నివేదికలను మంత్రి పరిశీలించారు.

**క్షమించేదే లేదు..**

"అధికారులు తప్పు చేస్తే క్షమించేది లేదు. రెవెన్యూ వ్యవస్థకు మంచి పేరు తీసుకురండి. మానవత్వంతో విధులు నిర్వహించండి. ఎవరిమీద నాకు కోపం లేదు. ప్రభుత్వం స్థలాన్ని పేదవాడికి ఇవ్వాలి. ప్రభుత్వ భూములను బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేస్తే ఎంతటి వారినైనా సహించేదిలేదు. అన్ని శాఖల వారీగా నిరంతరం సమీక్ష నిర్వహిస్తుంటా. పదోన్నతుల విషయంలో ఎవరి ప్రమేయంగానీ, పైరవీలుగానీ అవసరం లేదు. అన్ని నేనే చూసుకుంటా. అన్ని శాఖల వారిలా నేను కాదు.. చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాను. రెవెన్యూ శాఖలో కొందరు అధికారుల తీరుపై సిగ్గుపడుతున్నా. రాబోయే రోజుల్లో అధికారులంతా తలెత్తుకునేలా చేస్తా. ప్రమోషన్ల కోసం రాజకీయ నాయకుల మద్దతు తీసుకొచ్చినా వృథా ప్రయాసే. మీ రాజకీయ నాయకుడికి సంబంధించిన లేఖ తీసుకొస్తే నవ్వుతా. ఎవరైతే ఈ శాఖకు మంచి పేరు తెస్తే వాళ్ళని గుర్తిస్తా. తెలిసి తెలియన్నట్టు నటిస్తే సీరియస్ యాక్షన్ తీసుకుంటా" అని మంత్రి పొంగులేటి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.



## ఎస్‌సీవో సమావేశానికి రావాలని
# మోదీకి పాక్ ఆహ్వానం

## ఇస్లామాబాద్ పర్యటనకు ప్రధాని వెళ్తారా?

న్యూఢిల్లీ, ఆగస్ట్ 25 (ప్రభాత ఉదయం): షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశానికి హాజరయ్యేందుకు పాకిస్తాన్‌కు రావాలని ఆ దేశం ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించింది. ఈ ఏడాది ఇస్లామాబాద్‌లో సమావేశం జరుగనున్నది. ఈ భేటీకి షాంఘై కో ఆపరేటివ్ ఆర్గనైజేషన్ సభ్యదేశాల అధినేతలు భేటీకి హాజరుకానున్నారు. అయితే, భారత్-పాక్ మధ్య ప్రస్తుత సంబంధాల నేపథ్యంలో ప్రధాని పాక్‌కు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. ప్రధాని ఇస్లామాబాద్ పర్యటకు వెళ్తారా..? ఆయన తరఫున ఎవరైనా మంత్రులను పంపిస్తారా? అనేదానిపై వేచి చూడాల్సిందే. ఎస్‌సీవో సమావేశం అక్టోబర్ 15-16 తేదీల మధ్య జరుగనుండగా.. భేటీకి పాక్ ఆతిథ్యం ఇస్తున్నది. సమావేశానికి ఆతిథ్యం ఇచ్చేందుకు సభ్య దేశాలకు అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగా ఈ సారి ఆతిథ్యమిచ్చే బాధ్యత పాక్‌కు దక్కింది. ఇంతకు ముందు కజకిస్థాన్‌లో జరిగిన సమావేశానికి ప్రధాని దూరంగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భేటీకి దూరంగా ఉన్నారు. ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరయ్యారు. పాకిస్థాన్‌లో జరిగే సమావేశంలో నేతలకు వర్చువల్‌గా ప్రసంగించే వెసులుబాటు కల్పిస్తారా? లేదా? అన్న విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎస్‌సీవోలో చైనా, రష్యా, భారత్‌తో పాటు పాక్ సభ్యులు. షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్‌పై చైనా ఆధిపత్యం ఎక్కువగా ఉంటుంది. చైనా తన బీఆర్ఐ ప్రోత్సాహం కోసం ఈ వేదికను ఉపయోగిచుకుంటున్నది. ఈ చైనా ప్రాజెక్టుకు భారత్ మద్దతు ఇవ్వడం లేదు. గతేడాది సైతం ఎస్‌సీవో సంయుక్త ప్రకటనలోనూ బీఆర్ఐ ప్రస్తావనకు భారత్ అనుమతించలేదు. అయితే, భారతదేశం-పాకిస్తాన్ కలిసి పనిచేసే ఏకైక బహుపాక్షిక సంస్థ ఎస్‌సీవో. ఇది శాశ్వత ప్రభుత్వ అంతర్జాతీయ సంస్థ. ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని కొనసాగించడం దీని లక్ష్యం. 2001 సంవత్సరంలో ఎస్‌సీవో ఏర్పాటు కాగా.. 2003లో అమలులోకి వచ్చింది. ఈ సంస్థ లక్ష్యం సభ్య దేశాల మధ్య పరస్పర విశ్వాసం, సద్భావనను బలోపేతం చేయడం. రాజకీయాలు, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, పరిశోధన, సాంకేతికత, సంస్కృతి రంగంలో సమర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహించడం. విద్య, ఇంధనం, రవాణా, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణ మొదలైన రంగాల్లో సంబంధాలను మెరుగుపరచడం. సంబంధిత ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని నిర్ధారించడం. ఇందులో చైనా, రష్యా, భారతదేశం, పాకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్, కజకిస్తాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.



## తెలంగాణలో టీడీపీ బలోపేతంపై
# చంద్రబాబు ఫోకస్

మొదటి పేజీ తరువాయి...

చేస్తోంది. ఈ కార్యక్రమంలో టీటీడీపీని బలోపేతం చేయాలని నిర్ణయించాం. హడ్‌హాక్ కమిటీలు రద్దు చేశాం. కొత్త కమిటీలు వేస్తాం. ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తాం. పార్టీలో యువ రక్తానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం. వారిని ప్రోత్సహిస్తాం. నాపైన రెండు బాధ్యతలు ఉన్నాయి. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడం, రాక్షస పాలనను అంతమొందించి రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగాలని నన్ను గెలిపించిన ఏపీ ప్రజలకు న్యాయం చేయడం. ఇకపై తెలంగాణకు ప్రతి 15 రోజులకొకసారి వస్తా. మీ అందరి అభిప్రాయాలు తీసుకుంటా. అందరి నిర్ణయాల మేరకే పార్టీలో నిర్ణయాలుంటాయి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. టీటీడీపీ ప్రక్షాళనలో భాగంగా చంద్రబాబు గతంలోనే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ టీడీపీలో పాత కమిటీలను రద్దు చేస్తూ నిర్ణయించారు. పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారిగా ఉన్న కమిటీలను రద్దు చేశారు. ఏపీ, తెలంగాణలో ఒకేసారి కొత్త కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అనంతరమే తెలంగాణ టీడీపీ నూతన అధ్యక్షుడిని ఎంపిక చేస్తారని అంతా భావించారు. ఇదే అంశంపై ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మరోసారి చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఏపీ తరహాలోనే కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**టార్గెట్ అధికారం కాదు**

అయితే చంద్రబాబు ఇమ్మీడియత్ టార్గెట్ తెలంగాణలో టీడీపీ అధికారం కాదు. కానీ టీడీపీని జాతీయ పార్టీ అని చెప్పుకోవడమే తప్ప ఇతర రాష్ట్రాల్లో సీట్ల పరంగా ఎలాంటి ప్రభావం లేదు. టీడీపీ జాతీయ పార్టీ అనే ట్యాగ్ రావాలంటే కనీసం కొన్ని సీట్లన్నా వేరే రాష్ట్రంలో ఉండాలి అనేది చంద్రబాబు ఆలోచన. దానికి తెలంగాణ మంచి అవకాశంగా కనపడుతోంది. రానున్న ఎన్నికల్లో ముఖ్యంగా స్థానిక సంస్థల ఎలక్షన్ లలో కనీసం ఆంధ్ర సెటిలర్స్ ఉన్న ప్రాంతాల్లో అయినా సొంతంగా గానీ లేదా ఏదన్నా వేరే పార్టీ పొత్తు తో గానీ ప్రభావం చూపాలని బాబు ఆలోచిస్తున్నారు. అందులో భాగంగానే ఈమధ్య ఎక్కువగా హైదరాబాద్ లో తమ పార్టీ లీడర్ల తో కలుస్తున్నారు. వారికి పార్టీ బలోపేతంపై దిశా నిర్దేశం చేస్తూ వస్తున్నారు. మరి ఆయన వ్యూహ రచన ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి అంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

# చెరువులు చెర బట్టిన వారి... భరతం పడతాం

మొదటి పేజీ తరువాయి...

42 నెలల్లో పూర్తవుతుందని ఆశిస్తున్నామన్నారు. హెరిటేజ్ టవర్ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు కోకాపేట్ ఆర్థికక్షేత్రం అని అభివర్ణించారు. హెరిటేజ్ టవర్ నిర్మాణానికి అగర్వాల్ ఆరు ఎకరాలు భూదానం చేశారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా 22 లక్షల స్కూళ్లకు భోజనం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా సీఎం చేస్తున్నారని కొనియాడారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న గొప్ప కార్యక్రమానికి పెద్దల ఆశీర్వాదాలు ఉండాలి అని శ్రీధర్‌బాబు అకాంక్షించారు.

# విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి



అప్పిరెడ్డి బొమ్మా రెడ్డి ని సన్మానిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి..



విద్యార్థినికి సర్టిఫికెట్ ను అందచేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

## ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

బుద్వేల్, ఆగస్టు25(ప్రభాత ఉదయం): హైదర్ గూడ, రాధాకృష్ణ నగర్ కాలనీలో అప్పి రెడ్డి బొమ్మ రెడ్డి , పద్మా రెడ్డి నిర్వహిస్తున్న సంస్కృతి రూరల్ ఆర్ట్ సెంటర్ లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ విద్యార్థుల ఆర్ట్ ఎగ్జిబిషన్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి, ప్రోగ్రెస్ ఆఫ్ ఆర్ట్ బర్డ్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైనారు. కళారత్న ఆర్ రమేష్ బాబు కూడా విచ్చేసి సరస్వతీ మాత చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన వెలిగించి ఈ కార్యక్రమాన్ని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖన విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు మెడల్ లు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అందజేసినారు. దాని తర్వాత ప్రతి నెల చివరి ఆదివారము ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నారగూడెం మల్లారెడ్డి, మోంద్ర కొమురయ్య, మ్యాడం రామేశ్వర్ రావు, జీ. సురేందర్ రెడ్డి, జీ. సుధాకర్ రెడ్డి, సాబాద విజయ్ కుమార్, సులిగే వెంకటేష్, నల్లింగ్ రమేష్, కే. కిరణ్ చారి, కే. కృష్ణ, ఎస్. వేణు గోపాల్ రెడ్డి, కే. మహేందర్, టీ. ఇంద్రారెడ్డి, శివరాజ్ గౌడ్, కే. లింగం, కే. శ్రీనివాస్, కే. శివ కుమార్, కే రామకృష్ణ, జంగయ్య , విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్దశంఖ్యలో పాల్గొన్నారు.



వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ కి వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ మహమ్మద్ షరీఫ్, అతని కుమారుడు మహమ్మద్ అర్బాజ్ లు

## చిన్న జాత్రం గ్రామంలో అషర్ ఖానాను అభివృద్ధి చేయాలి

బుద్వేల్, ఆగస్టు25(ప్రభాత ఉదయం): మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలం చిన్న జాత్రం గ్రామంలో గల అషర్ ఖానాను సందర్శించి అభివృద్ధి చేయాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ మహ్మద్ షరీఫ్ శనివారం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా షరీఫ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్వాన్ ఎంఎల్ఏ కౌసర్ మోహియుద్దీన్ రాసిన లేఖను కూడా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కు అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ , ఆయన కుమారుడు రాఘవేంద్ర కాలనీ మజ్లీస్ అధ్యక్షుడు మమ్మద్ అర్బాజ్ లు లు మాట్లాడుతూ, చిన్న జాత్రం గ్రామంలో ఉన్న అషర్ ఖానా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఎమ్మెల్యే కౌసర్ మొహి యుద్దీన్ సహకారంతో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ గా ఉన్న సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్ ని కలిసి బాగు చేయాలని కోరడం జరిగిందన్నారు.

## కాటేదాన్-శివరాంపల్లి ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఓరుగంటి భద్రయ్య గుప్తా



ఓరుగంటి భద్రయ్య గుప్తా

బుద్వేల్, ఆగస్టు25(ప్రభాత ఉదయం): కాటేదాన్ - శివరాంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ఓరుగంటి భద్రయ్య గుప్తా ఏకగ్రీవంగా ఎంపికైనారు. ఆదివారం శివరాంపల్లిలోని సంఘం భవనంలో జరిగిన ఎన్నికలలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓరుగంటి భద్రయ్య గుప్తను అధ్యక్షులుగా ఎంపిక చేశారు. ఎన్నికలకు సంఘం సీనియర్ సభ్యులు అర్థం లక్ష్మయ్య గుప్తా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు . మొత్తం ఆరు మంది సభ్యులు అధ్యక్ష స్థానానికి పోటీ పడగా పెద్దల సూచనతో ఐదుగురు సభ్యులు విరమించుకున్నారు. దీంతో ఓరుగంటి భద్రయ్య గుప్తా ను ఏకగ్రీవంగా కాటేదాన్ శివరాంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం పూర్వ అధ్యక్షుడు వీరబొమ్మ శ్రీరాములు గుప్తాతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఓరుగంటి భద్రయ్య గుప్తా మాట్లాడుతూ, సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి ముందుండి పని చేస్తానన్నారు . తనను సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి సభ్యుడికి కృతజ్ఞతలు తెలియజేశారు.



పొదుపు సంఘం సమావేశం

## గాయత్రీ పొదుపు సంఘం 24వ వార్షికోత్సవం

బుద్వేల్, ఆగస్టు25(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధి లో గల ఆదర్శ కాలనీ శ్రీ గాయత్రి పొదుపు సంఘం 24వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వసూళ్ళు, చెల్లింపుల పట్టిక, వ్యయము, ఆదాయం బాధ్యతలు, ఆస్తులు పట్టిక ను సంఘం కార్యదర్శి ఏర్వ కుమారస్వామి, అకౌంటెంట్ గంజి మార్కండేయ సంఘ సభ్యులకు తెలియ చేశారు. . ఇతర అంశములు అధ్యక్షులు యేదిరే శ్రీనివాస్ అనుమతితో చర్చిచడం జరిగింది. సంఘం మాజీ అధ్యక్షులు కుడికల గణమ్మ అధ్యక్షులు యేదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దాశరథి బిక్షపతి మాట్లాడుతూ..పొదుపు సంఘం సభ్యులు క్రమపద్ధతిలో ప్రతినెల పొదుపులు చెల్లించుకుని సభ్యులు అవసరానికి తీసుకున్న అప్పు కిస్తీలు సమయానికి చెల్లిస్తూన్నార న్నారు. దినం దినం సంఘాన్ని అభివృద్ధి చేసుకోవడం సంఘం సభ్యుల విజయమన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి మాట్లాడుతు ప్రైవేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారులతో ఆ గ్రామస్తులు విసిగిపోయారు.. కావాల్సిన రుణాలు లభించక అనేక ఇబ్బందులు పడ్డారు. నేటి పొదుపు రేపటికి మలుపు అనే నినాదంతో పొదుపు బాట పట్టమన్నారు. 2000 సంవత్సరలో 4 గురు సభ్యులతో ప్రారంభించి 900 మంది సభ్యులతో 5 కోట్ల తన్నోవర్ తో సంఘం నడుస్తుందన్నారు. సొంత భవనంతో సీసీ కెమెరాల నిఘా తో దినం దినం సంఘాన్ని అభివృద్ధి చేసుకోవడం సంఘం సభ్యుల విజయమని సొంత భవనంతో సీసీ కెమెరాల నిఘా తో దినం దినం సంఘాన్ని అభివృద్ధి చేసుకోవడం సంఘం సభ్యుల విజయమన్నారు. వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షులు యేదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దశపతి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి, సహాయ కార్యదర్శి దశపతి రాజు, పాలకవర్గ సభ్యులు కూడికల ప్రభాకర్, గాజుల సురేష్, ముదిగొండ సత్యనారాయణ మసినీ వనజ గుమస్తాలు గంజి మార్కండేయ, నామని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## మణికొండ చిత్రపురి కాలనీలో 225 విల్లాలకు నోటీసులు

గండిపేట్,ఆగస్టు 25(ప్రభాత ఉదయం) నిబంధనలు అతిక్రమించి నిర్మించిన నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపిస్తూ అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు.మణికొండ చిత్రపురి కాలినీలోని 225 విల్లాలకు నిర్మాణ అనుమతులు లేవంటూ మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు.జీవో నంబర్ 658 కు విరుద్ధంగా విల్లాలను నిర్మించినట్లు గుర్తించారు.జీ౦1 అనుమతులు తీసుకుని జీ౦2 నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు.గత పాలకవర్గం దొంగచాటున అనుమతులు పొందినట్లు తేల్చారు.15 రోజుల్లోగా నోటీసులకు రిప్లై ఇవ్వాలని సూచించారు.గత పాలకవర్గం తప్పుడు నిర్ణయం వల్ల చిత్రపురి సొసైటీకి రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వాటిలో తెలిపారు.చిత్రపురిలో జరిగిన అవకతవకల గుట్టును రట్టు చేయాలంటూ ఫిర్యాదులు రావడంతో మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీచేశారు.కాగా,సొసైటీ సభ్యులు అనుమతి తీసుకున్న దానికంటే అదనంగా 7 విల్లాలను అక్రమంగా నిర్మిస్తున్నారు.గుర్తించిన హైడ్రా అధికారులు.ఈ నెల 21న వాటిని నేలమట్టం చేశారు.



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న యువకులు

## మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలి

బుద్వేల్, ఆగస్టు25(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీలో నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య చేయడం పై నిరసన తెలిపారు. బుద్వేల్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి మాట్లాడుతూ కోల్ కతా లో ట్రైనీ డాక్టర్ పై సామూహిక అత్యాచానికి పాల్పడి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో చాలా ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని నిందితులను కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. నేటి సమాజంలో మహిళాలకు రక్షణలేకుండా పోయిదన్నారు. సహాయ కార్యదర్శి కొంపల్లి జగదీష్ మాట్లాడుతు, మహిళలు, బాలికలపై రోజు రోజుకు పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. సమజంలో పెరుగుతున్న హింసకు కారణాలను సమూ లంగా తొలగిస్తే తప్ప ఇలాంటి ఘటనలు జరగవ న్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు రామారావు, ధనుజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై పి.ఆర్.టి.యుటిఎస్ సంఘం నిరంతర పోరాటం



### రాజేంద్రనగర్ మండల పి.ఆర్.టి.యుటిఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక.. అధ్యక్షులుగా సుదర్శన్

రాజేంద్రనగర్,ఆగస్టు 25(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ మండల పి.ఆర్.టి. యుటిఎస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులుగా శివరాంపల్లి పాఠశాలకు చెందిన సుదర్శన్ ఎన్నికయ్యారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉపాధ్యాయుల సమస్యలు పి. ఆర్.టి.యుటిఎస్ సంఘంతోనే సాధ్యమైతుందన్నారు.ఉపాధ్యాయుల సమస్యలపై పి.ఆర్.టి.యుటిఎస్ సంఘం నిరంతర పోరాటం చేస్తుందని,ఏకీకృత సర్వీస్ రూల్ సాధనకై కృషి చేస్తామని జిపిఎఫ్ బకాయిలు మెడికల్ రియంబర్స్మెంట్ తదితర బకాయిలను వెంటనే చెల్లించడానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో రాష్ట్రంలో ముందుంటున్న సంఘం పిఆర్టియు సంఘం అని తెలిపారు.పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్,డిఎలు, పిఆర్సి,సిపిఎస్ రద్దు,పెండింగ్ బిల్స్ వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.సుదర్శన్,గౌరవ అధ్యక్షులు మాణిక్యంరెడ్డి,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, అసోసియేట్ అధ్యక్షులు అల్లాహ వలి,రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్తయ్య గౌడ్,మహిళా ఉపాధ్యక్షులు కల్పన,కార్యదర్శి వెంకటయ్య,అమ్తుల్ అలీం మహిళా కార్యదర్శి,రోహిణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారులు బంధయ్య, నరేందర్ రెడ్డి తెలిపారు.ఎన్నికైన వారు రెండు సంవత్సరాల పదవికాలంలో కొనసాగుతారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాద్యులు సురేష్,వహీద్,సుధాకర్,సురేష్ చారి,శ్రీనివాస్ రెడ్డి, హెడ్ మాస్టార్ కిషన్ ఝాన్సీ,రవి,జవర్ లాల్, గోవర్ధన్,అనిత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### దయానంద విద్యా మందిర్ ఆధ్వర్యంలో ఘనంగా

# సామూహిక శ్రావణమాస యజ్ఞాలు





గద్వాల జిల్లా ప్రతినిధి ,ఆగస్టు25(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణం దయానంద విద్యా మందిర్ లో సామూహిక శ్రావణమాస యజ్ఞాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈనెల 5వ తేదీ నుండి ప్రతిరోజు ఇంటింటా, పల్లె పల్లెలో నిత్యాగ్నిహోత్రం హోమాలు నిర్వహించారు. ఆదివారం సామూహిక శ్రావణమాస యజ్ఞం మరియు పూర్ణాహుతి ఘనంగా 50 మంది జంటల దంపతులు పాల్గొని యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఆర్య సమాజ్ ప్రతినిధి సభ తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ ఆర్య సమాజ్ అధ్యక్షులు విట్టల్ రావు ఆర్య పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పవిత్ర హవన కార్యక్రమము ఈ శ్రావణమాసంలో వేద పండితులు, వైదిక ధర్మ ప్రచారకులు డి. నళినిఆచార్య మాజీ డి.ఎస్.పి యజ్ఞ బ్రహ్మ వేద ప్రచారకురాలు వేద యజ్ఞ పరిరక్షణ సమితి వీరి పౌరోహిత్యంలో 50 మంది దంపతులు సామూహిక శ్రావణమాస యజ్ఞ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో దయానంద విద్యా మందిర్ గద్వాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ... పంచ మహా భూతములను శుద్ధి చేయుటకు మూలాధారమే యజ్ఞమని ఈ యజ్ఞం చేయటం వలన వర్షములు కురిసి... పంటలు పండి... ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ఆచార్యులు ఆర్య సమాజ్ అధ్యక్షులు విట్టల్ రావు ఆర్య అన్నారు. ఈ కార్యక్రమంలో దయానంద విద్యా మందిర్ గద్వాల కరస్పాండెంట్ పుట్ట శ్రీనివాస్ ఆర్య ,ప్రిన్సిపల్ అరుణాత్ రెడ్డి ,హెడ్మాస్టర్ సత్యకుమార్ ,హరిచరణ్, గోపీ, నవీన్, సంపత్ కుమార్, హెడ్ మిస్ అనిత, వరలక్ష్మి, సుజాత, రూప, హేమలత ,కళ్యాణి, రజిత, ఉమా, గౌతమి, మహేశ్వరి ,రజని, పాఠశాల పీఈటీలు తిమ్మన్న,కళ్యాణ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, బిజెపి నాయకులు అడ్వకేట్ రాజశేఖర్ రెడ్డి, అడ్వకేట్ గంగాధర్ , బిజెపి నాయకులు అయ్యప్ప రెడ్డి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయునులు, విద్యార్థినిలు ,విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



### రైతులందరికీ షరతుల్లేకుండా

# 2 లక్షల రుణమాఫీ చేయాలి

### ఎఐఎఫ్ బి రాష్ట్ర కార్యవర్గసభ్యులు రాములు యాదవ్ డిమాండ్

ఎల్ బి నగర్,ఆగస్టు25(ప్రభాత ఉదయం) రాష్ట్రంలో రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలను ఎలాంటి షరతుల్లేకుండా సంపూర్ణంగా మాఫీ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్ బి) పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బి రాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సిఎం ఇప్పుడు అనేక షరతులు విధించడంతో సగానికిపైగా రైతులు రుణమాఫీ కాలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు పెట్టి, ఇప్పుడు మాఫీ చేయకుండా రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇంకా 40 శాతం మందికి ఇంకా మాఫీ చేయలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో మాదిరిగా రైతులు బ్యాంకుల చుట్టూ కాగితాలు పట్టుకొని తిరిగే పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. రుణమాఫీలో పొరపాటు జరిగిందని ఇప్పటికే మంత్రులు ఒప్పుకొన్నారని తెలిపారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని, లేనిపక్షంలో ఎఐఎఫ్ బి ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు.




# ప్రమాదకరంగా ఇనుప విద్యుత్ స్తంభాలు

### సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం

### ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

గద్వాల టౌన్,ఆగస్టు25(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణ కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారులు పలు ప్రాంతాలలో ఇనుప స్తంభాలు మార్చకపోవటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ లైన్ల కోసం గతంలో ఇనుప స్తంభాలను ఏర్పాటుచేశారు. వాటితో ప్రమాదాలు పొంచి ఉండడంతో క్రమంగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ.. ఇప్పటికీ గద్వాల పట్టణంలోని పలు వార్డులలో ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. వీటి ద్వారా ప్రమాదాలు జరుగుతాయని వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలను మార్చి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఆదేశాలు ఇచ్చినా.. క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో అది అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నా యి. పలు వార్డులలో నిత్యం వందలాది మంది రద్దీగా ఉండే ప్రాంతాలలో విద్యుత్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. విద్యుత్ స్తంభాలు దిగువ భాగంలో తుప్పుపట్టాయి. వర్షాకాలంలో విద్యత్‌స్తంభాలు తాకడంతో షాక్ గురయ్యే అవకాశం ఉంది. 10వ వార్డులో ఇనుప స్తంభాలను మార్చి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని 10వ వార్డు కౌన్సిలర్ విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారుల నుంచి స్పందన లేదు. ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యులని వారు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాని కౌన్సిలర్ కోరారు

# నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి: ఎస్ ఎఫ్ ఐ

గద్వాల, ఆగస్టు25(ప్రభాత ఉదయం) నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజులలో కూడా పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ ఎఫ్ ఐ) నాయకులు నరసింహ కిరణ్ డిమాండ్ చేశారు,ఆదివారం పట్టణంలోని వివిధ ప్రైవేటు విద్యా సంస్థలను సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య విశ్వ భారతి సంస్కార్ అగస్త్య నోబుల్ సత్యసాయి సహా పలు ప్రైవేటు విద్యాసంస్థలను సందర్శించామని అన్నారు ప్రైవేటు విద్యా సంస్థలు రెండవ శనివారం ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలలో కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నారని విమర్శించారు పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే కాకుండా 6, 7 ,8, 9 తరగతులకు కూడా ఐఐటీ పేరుతో తరగతులను పరీక్షలను నిర్వహిస్తున్నారని విమర్శించారు సాధారణ సమయంలోనే ప్రభుత్వం నిబంధనలు పాటించకుండా సమయపాలన పాటించకుండా ఉదయం నుండి రాత్రి వరకు తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలు చివరికి సెలవు రోజులలో కూడా విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు విశ్రాంతి విరామం లేకుండా విద్యా సంస్థలను నడపడం సరైనది కాదన్నారు చిన్నారుల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ విద్యా ప్రణాళికను రూపొందించారని కానీ కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు మాత్రం విద్యాశాఖ,విద్యాశాఖ అధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోకుండా తరగతులను నిర్వహిస్తున్నారని విమర్శించారు సెలవు రోజులలో నిర్వహించే తరగతుల గురించి ప్రైవేట్ యాజమాన్యాలను ప్రశ్నించగా అందరూ నిర్వహిస్తున్నారు కాబట్టి తాము నిర్వహిస్తున్నామని అత్యంత నిర్లక్ష్యంగా బాధ్యతరాహితంగా సమాధానాలు చెబుతున్నారని విమర్శించారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేశామన్నారు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కావున విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రయివేటు పాఠశాలలు నడుచుకోకకపోతే కలెక్టర్ కి పిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



# రసాయనిక ఎరువులు వద్దు.. వర్మి కంపోస్ట్ ముద్దు

### గాదే రాజశేఖర్, బంకట్ లాల్ భాటి

శంషాబాద్,ఆగస్టు 25(ప్రభాత ఉదయం) రసాయనిక ఎరువులు వాడటం మానేసి వర్మి కంపోస్టు ద్వారా వ్యవసాయం చేస్తే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని బంకట్ లాల్ బాటి . గాదే రాజశేఖర్ సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త విధానాలను హందిపుచ్చుకొని వ్యవసాయంలో లాభాలు పొందాలని సూచించారు. రైతులు వర్మి కంపోస్టు ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేస్తే మంచి ఫలితాలు లభిస్తుందని రైతులు బంకట్ లాల్ బాటి. గాదే రాజశేఖర్ సూచించారు. శంషాబాద్ మండలంలోని గండిగూడ లో ఉన్న హీరాలాల్ భాటి గార్డెన్ లో సీసీఐఆర్ . కేంద్రీయ ఔషధ సుగంధ మొక్కల పరిశోధన సంస్థ. సర్వోదయ మండలి సహకారంతో ఆదివారం ఏర్పాటుచేసిన సదస్సులో శంషాబాద్. జడ్చర్ల. షాద్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ సభ్యుడు గాదే రాజశేఖర్. రైతు బంకట్ లాల్ బాటి మాట్లాడుతూ నాలుగు అంచల వ్యవసాయ విధానం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం తమ వ్యవసాయ క్షేత్రంలో పసుపు. మునగ. బెండ. మహాగని పంటలను ఏకకాలంలో పండించడం జరుగుతుందని వివరించారు. మరోవైపు సుగంధ. ఔషధ మొక్కల పెంపకం వలన రైతులకు పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. సుగంధ మొక్కల నుండి సుగంధ తైలాన్ని తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకుండా సహజమైన పద్ధతిలో సాగు చేస్తే ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని పెద్ద మొత్తంలో దిగుబడులు పెరిగే అవకాశం కూడా ఉంటుందని గాదే రాజశేఖర్. బంకట్ లాల్ రైతులకు వివరించారు. వ్యవసాయ పొలాల్లో స్ప్రే చేసే విధానాన్ని అందుకోసం ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ ఔషధ సుగంధ మొక్కల పరిశోధన సంస్థ టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్ కుమార్. రైతులు కొండారెడ్డి పల్లె మాజీ సర్పంచ్ బాలేష్. సర్వోదయ మండలి కార్యదర్శి శ్రీనివాస్. ఉదయ్ గౌడ్. శ్రీశైలం యాదవ్. గాదే రామ్మోహన్. కృష్ణ పటేల్. మహమ్మద్ సలీం వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



# నేడు శంషాబాద్‌కు రానున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

శంషాబాద్, ఆగస్టు 25( ప్రభాత ఉదయం)చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి సోమవారం శంషాబాద్ లో పర్యటించి ఉన్నారు. తొండుపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పనులు నతనడకన నడుస్తుండడంతో స్థానిక బిజెపి నాయకులు కొండ పరమేష్ గౌడ్ తదితరులు ఇటీవల కొండ విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడారు. సంబంధిత అధికారుల సమక్షంలో సోమవారం బ్రిడ్జి నిర్మాణం పనులపై సమీక్షించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ఆయన తొండుపల్లి వద్దకు రానున్నారని తెలిపారు.



# వైద్య కోర్స్ స్వీట్ సాధించిన విద్యార్థికి ఎమ్మెల్యే జిఎంఆర్ ఆర్థిక సహాయం

### విద్యార్థి తండ్రికి 25 వేల చెక్కును అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, ఆగస్ట్ 25(ప్రభాత ఉదయం) వైద్య కోర్సులో సీటు సాధించిన అభ్యర్థికి దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జిఎంఆర్ ఆర్థిక సహాయం అందజేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కొత్తకోట మండలం అప్పరాల గ్రామానికి చెందిన నర్కుల ఆంజనేయులు కుమారుడు అరుణ్ కుమార్ కు తమిళనాడు లోని ఓ ప్రముఖ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ రావడంతో అతనికి పై చదువుల ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయల ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి. మధుసూధన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... విద్యాభివృద్ధితోనే సమాజం లోని కుటుంబాలన్నీ అభివృద్ధికి నోచుకుంటాయని అందుకోసం తల్లిదండ్రులు పిల్లలను విధిగా చదివించాలన్నారు.



# కామ్రేడ్ మగ్దూం మహినోద్దీన్‌కు ఘనంగా నివాళ్ళు

హైదరాబాద్, ఆగస్ట్ 25(ప్రభాత ఉదయం) కామ్రేడ్ మగ్దూం మహినోద్దీన్ వర్ధంతి సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ నారాయణ నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ , రాష్ట్ర సమితి సభ్యులు కలకొండ కాంతయ్య , రమావత్ అంజయ్య నాయక్ ,సిపిఐ పార్టీ ఆఫీస్ కార్యదర్శి గోవిండ్ , శ్రీమాన్, శ్రీరాములు, బోడ అంజయ్య, రాజమౌళి సిపిఐ నాయకులు జర్పుల శివనాయక్ వేముల బుచ్చయ్య తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.